క్లుప్తంగా

రూ.10 లక్షలతో అదనపు భవనం



శ్లాబ్‌దశలో ఉన్న పాఠశాల భవన నిర్మాణం

దత్తిరాజేరు: మండలంలోని విజయరాంపురం ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు–నేడు పనుల్లో భాగంగా రూ.10 లక్షలతో అదనపు భవనాన్ని నిర్మిస్తున్నట్లు హెచ్‌ఎం సింహాచలం తెలిపారు. ప్రస్తుతం ఈపనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలో పనులు పూర్తి చేయించి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తామని హెచ్‌ఎం చెప్పారు.

సమగ్రంగా ఓటర్ల సర్వే



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్ కుమార్

జామి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓలు) ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్ల జాబితాపై సమగ్రంగా సర్వే చేయాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ అన్నారు. మండలంలోని భీమసింగి, చిల్లపాలెంలో బీఎల్‌ఓలు శనివారం చేపట్టిన ఓటర్ల జాబితా సర్వేను ఆయన పరిశీలించారు .ఈసందర్భంగా ఆయన బీఎల్‌ఓలతో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఓటరు చిరునామా, పోలింగ్ కేంద్రాలు, తదితర వివరాలు సరిగా ఉన్నదీ లేనిది పరిశీలించాలని, అభ్యంతరాలు ఉంటే స్వీకరించి సరిచేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారితో ఓటు హక్కుకు దరఖాస్తు చేయించాలని సూచించారు.

చలో కలెక్టరేట్ రేపు



చలో కలెక్టరేట్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మి, తదితరులు

గజపతినగరం: పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 31వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్ర మం నిర్వహించినున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి తెలిపారు. మండలంలోని పురిటిపెంట న్యూకాలనీలో సంబంధిత వాల్ పోస్టర్లను ఎండీఎం కార్మికులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైస్కూళ్లలో పని చేస్తున్న ఎండీఎం కార్మికులకు వేతనం ఇవ్వాలని, పథకాన్ని ప్రైవేటుపరం చేయరాదని, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. చలో కలెక్టరేట్‌ను ఎండీఎం కార్మికులు అంతా విజయవంతం చేయాలని కోరారు.

శ్రీనివాసుడికి ప్రత్యేక పూజలు



తులసీదళాల అలంకరణలో శ్రీనివాసుడు

విజయనగరం టౌన్: పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో కొలువైన శ్రీనివాసునికి శనివారం వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పీవీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు, తులసీదళాలతో అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం పూల్‌బాగ్: సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా నాయకుడు సుంకరి గణేష్ డిమాండ్ చేశారు. సోమవారం సెలవు అయినప్పటికీ పట్టణంలోని పలు కళాశాలలు తెరవడంతో ఆయా కళాశాలల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఉదయ్, మౌళి, భాస్కర్, ప్రసాద్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

- ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, సచివాలయ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గజపతినగరం: ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: అన్నదాతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రం(ఆర్బీకే)–2, వైఎస్సార్ విలేజ్ క్లినిక్– 2ల నూతన భవనాలను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల ప్రయోజనాల దృష్ట్యా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఆర్బీకేలను నెలకొల్పారని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరు వులు, పురుగుమందులు, పాడిరైతులకు పశుదాణా అందించడంతో పాటు పంట కొనుగోళ్లు కూడా చేపడుతున్నామని చెప్పారు. పొరుగురాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ఇక్కడ ఆర్బీకేలను ఆదర్శంగా తీసుకుని వారి రాష్ట్రాల్లో అమలు చేసే ఆలోచన చేస్తున్నాయని తెలిపారు. గతంలో విత్తనాల కోసం మండల కేంద్రాల్లోని వ్యవసాయ కార్యాలయాల వద్ద ఎండల్లో పడిగాపులు కాయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఆర్బీకేలను నెలకొల్పిన తర్వాత రైతులకు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పనితప్పిందని, గ్రామాల్లోనే లభిస్తున్నాయని చెప్పారు.

ప్రజారోగ్యమే ధ్యేయం

సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యమే ధ్యేయంగా వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. ప్రతి గ్రామసచివాలయం పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు చేరువ చేశారని అన్నారు. అలాగే 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి వైద్యాధికారులు నెలకు రెండుసార్లు వచ్చి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్యసేవలందిస్తున్నారని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, స్థానిక సర్పంచ్ నరవ కొండమ్మ, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీదేవి, ఎంపీటీసీ కర్రి కళావతి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎం.శ్రీధర్, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ శాఖ డీఈలు ప్రసాద్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్యం సాకారం



గజపతినగరం రూరల్: జిన్నాం సచివాలయ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

గజపతినగరం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామసచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేశారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని జిన్నాం గ్రామంలో గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్ భవనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయని అన్నారు. జిన్నాంలో సుమారు కోటి రూపాయలతో సచివాలయం, విలేజ్ క్లినిక్, ఆర్బీకేలకు భవనాలను నిర్మించామని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బూడి వెంకటరావు, నాయకులు బెల్లాన త్రినాథరావు,కరణం ఆదినారాయణ, ముత్యాలనాయుడు, దొగ్గదేవుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాచలవలసలో..

దత్తిరాజేరు: మండలంలోని పాచలవలస గ్రామంలో రూ.34 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, విలేజ్ క్లినిక్‌ల భవనాలను ఎమ్మెల్యే బొత్స అప్పలనర సయ్య ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారని మండల ఇంజినీరింగ్ అధికారి టి.రమ శనివారం తెలిపారు. అలాగే భవనాల ప్రారంభోత్సవం అనంతరం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ధ్యేయం



మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

వేపాడ: పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని శింగరాయి సచివాలయం పరిధి అరిగిపాలెం గ్రామంలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానిక సర్పంచ్ దుల్ల లక్ష్మి, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. స్థానిక, మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిక మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 98 శాతానికి పైగా సీఎం జగన్ అమలు చేశారని చెప్పారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అంతకుముందు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నాయకులు ఘనంగా సన్మానించా రు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, ఎంపీటీసీలు టి.వి.రమణ, ఏ.సత్యనారాయణ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు మురిపిండి గంగరాజు, రామునాయుడు, వేమన రాము, స్థానిక నాయకులు దుల్ల సన్యాసిరావు, బుద్దా అప్పలనాయుడు పాల్గొన్నారు.

రూ.1.90 కోట్లతో రోడ్డు పునరుద్ధరణ



కాలంరాజుపేట మీదుగా సీతారామపురంనకు చేపడుతున్న రోడ్డు పునరుద్ధరణ పనులు

గజపతినగరం: మండలంలోని సీతారామపురం గ్రామం తారురోడ్డు పునరుద్ధరణ పనులు జోరుగా సాగుతున్నాయి. గజపతినగరం ఎన్‌హెచ్– 26 నుంచి ఎం.వెంకటాపురం, డోళపాలెం, కాలంరాజుపేట, పిడిశీల మీదుగా సీతారామపురం వరకు 5.5 కిలోమీటర్ల మేర తారురోడ్డు పునరు ద్ధరణకు ప్రభుత్వం ఏఎంసీ నిధుల నుంచి కోటీ తొంభైలక్షల రూపాయలు మంజూరు చేసిందని పంచాయతీరాజ్ శాఖ డీఈ పి.అప్పలనా యుడు తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయయ్య ఆ అయిదుగ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించిన సమయంలో ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందించి రోడ్డు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించడంతో ఏఎంసీ నిధులతో రోడ్డు పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇటీవలే పనులు ప్రారంభించారు. పాత రోడ్డును లెవెల్ చేసి చిప్స్, క్రషర్ బుగ్గి వేసి చదును చేశారు. తారుపూత పనులు మిగిలి ఉన్నాయి. పనులు చకచకా సాగుతుండడంతో ఆ రోడ్డు పరిధిలోని ఎం.వెంకటాపురం, డోళపాలెం, కాలంరాజుపేట, పిడిశీల, సీతారామపురం గ్రామాల సర్పంచ్‌లు గేదెల ఈశ్వరరావు, తుంపిల్లి కాంతమ్మ, నరవకొండమ్మ, పొంద్రంకి మాదవి, ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వైఎస్సార్ బీమా.. పేదలకు ధీమా



బాధిత కుటుంబాలకు బీమా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ప్రమాదాల బారినపడి ఇంటి పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం కొండత అండగా నిలుస్తోందని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్తసుంకరపాలెం గ్రామానికి చెందిన పెదిరెడ్ల సన్నిబాబు, కంటకాపల్లి గ్రామానికి చెందిన సేనాపతి గణేష్ కొంతకాలం క్రితం ప్రమాదవశాత్తు మరణించారు. బాధిత కుటుంబాలకు చెరో రూ.5 లక్షలు చొప్పున మంజూరైన డబ్బులకు సంబంధించిన చెక్కులను కొత్తసుంకరపాలెం గ్రామంలో ఎమ్మెల్యే శనివారం అందజేశారు. రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ పి.శివపార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు మదిన అప్పలరమణ, పి.ఎస్.ఎన్. పాత్రుడు, పి.వెంకటసత్యనారాయణ, పి.శరభన్న పాత్రుడు, పెదిరెడ్ల పార్వతి పాల్గొన్నారు.

శ్రావణ ఏకాదశి పూజలు



బొండపల్లి: రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: అధిక శ్రావణ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేయించారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



జామి: పూజలందుకుంటున్న స్వామివారు

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులతో అభిషేకాలు చేయించారు.

పందెం రాయుళ్ల అరెస్టు

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామ సమీపంలోని ఓ చెరువు వద్ద నిర్వహించిన కోడిపందాల శిబిరంపై ఎస్‌ఐలు వీరజనార్దన్, హేమంత్‌కుమార్ సిబ్బందితో కలిసి శనివారం మధ్యాహ్నం దాడి చేశారు. ఆరుగురు కోడి పందాల రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ,11,070 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వీరజనార్దన్ తెలిపారు.

బాధితులకు ఆర్థిక సహాయం



గుర్ల: బాధితుడికి నగదు అందజేస్తున్న జానపద గాయకుడు రమణ

గుర్ల: మండలంలోని పకీరుకిట్టాలికి చెందిన బూర్లె రాము క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. మందులు కొనడానికి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులుపడుతున్న ఆయనకు జానపద గాయకుడు, పల్సర్‌బైక్ రమణ రూ.10 వేలు, నిత్యావసర సరు కులను శనివారం అందజేశారు. దాత రమణ మాట్లాడుతూ బాధితుడు రాము పడుతున్న ఇబ్బందులను మాతృభూమి సేవా సంఘం సభ్యులు తన దృష్టికి తీసుకురావడంతో తోచిన సాయం చేశానని చెప్పారు. ఎంపీటీసీ జోగినా యుడు, బూర్లె పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: బాధితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న వాసవీ క్లబ్, ఆర్యవైశ్య మహాసభ సభ్యులు

వాసవీ క్లబ్ తరపున..

వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామానికి చెందిన ఉడత శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పెదనందిపల్లి వాసవీ క్లబ్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సభ్యులు రూ.7,500 ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. క్లబ్ సభ్యులు నాగవెంకటఅప్పారావు, శ్రీను, రాజు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పల ఈశ్వరరావు, రాష్ట్ర డైరెక్టర్ మోహన్‌రావు, వేపాడ వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ సంపత్ పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ తనిఖీ



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

బొండపల్లి: గొట్లాం గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో డీఎంహెచ్‌ఓ భాస్కరరావు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. మందులను, రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై సిబ్బందిని ఆరా తీశారు. వర్షాలు కురుస్తు న్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా కేంద్రం టీడీ సూపర్‌వైజర్ వర్మ, బొండపల్లి పీహెచ్‌సీ వైద్య సహాయకులు బి.విశ్వేశ్వరరావు, వైద్య సిబ్బంది సత్తిరాజు, ఏఎన్‌ఎంలు వసంత లక్ష్మి, లక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న రక్తదాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని సెట్విజ్ సీఈఓ కె. రాంప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో సామాజిక కార్యకర్త శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ఆరోగ్యవంతులైన యువకులు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. రక్తకొరత తీర్చడానికి ప్రతిఒక్కరూ తమ వంతుగా రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఎం.రాము, వి.సత్యరామ్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలో చిన్న అన్నవరంగా పేరొందిన కొత్తపేట వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఆలయ అర్చకుడు సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాలతో విశేష అభిషేకాలు జరిపించారు. సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామి సన్నిధిలో సామూహిక వ్రతాలు చేయించుకున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొండేటి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

జోరందుకున్న వరినాట్లు

- ఆశాజనకంగా వర్షాలు



ఎల్.కోట మండలం నీలకంఠాపురంలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు



నీలకంఠాపురంలో వరినారు తీస్తున్న మహిళలు



వేపాడలో ట్రాక్టర్‌తో దమ్ముచేస్తున్న రైతులు



వేపాడలో వరినాట్లు వేస్తున్న మహిళలు

కొత్తవలస/ వేపాడ: కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఎస్.కోట నియోజకవర్గంలో ఖరీఫ్ వరినాట్లు జోరందుకున్నాయి. ముందుగా వరినార్లుపోసిన రైతులు ఉభాలు ప్రారంభించారు. రెండు రోజులుగా నియోజకవర్గం పరిధిలో ని కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి, ఎస్.కోట మండలాల్లో రైతులు దమ్ములు చేస్తూ బిజీబిజీగా ఉన్నారు. కొత్తవలస మండలంలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 1,010 హెక్టార్లు, లక్కవరపుకోట మండలంలో 3,889 హెక్టార్లు, జామి మండలలో 5,234 హెక్టార్లు, ఎస్.కోట మండలంలో 4,142 హెక్టార్లు, వేపాడ మండలంలో 3,573 హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో సుమారు 30 శాతానికిపైగా వరి నాట్లు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నా రు. రైతులకు అవసరమైన 1,607 మెట్రిక్‌టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచామని కొత్తవలస వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు(ఏడీఏ) ఎల్.విజయ తెలిపారు. వరి నాట్లు వేసే ముందు పొలాన్ని రెండు పర్యాయా లు దమ్ము చేసి మూడురోజుల తర్వా నాట్లు వేయాలని ఏడీఏ సూచించారు.

దీర్ఘకాలిక సమస్యలకు మోక్షం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్‌లో చేపడుతున్న శంకుస్థాపన మాసోత్సవాల్లో భాగంగా దీర్ఘకాలిక సమస్యలకు మోక్షం కలుగుతోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 48వ డివిజన్‌లో రూ.16 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ముత్యాలమ్మపేట వద్ద రహదారులు, కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు మధు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లనాటి సమస్యలను కూడా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక దృష్టితో పరిష్కరిస్తున్నారని చెప్పారు. శంకుస్థాపనల మాస మహోత్సవాల పేరిట ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో కాలువలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, తదితరులు పాల్గొన్నారు.